శుభ ముహూర్తాల సీజన్.. తనిఖీలతో పరేషాన్

● నాకాబందీలతో బెంబేలు ● ఇబ్బందులు పడుతున్న సాధారణ ప్రజలు ● లష్కర్ పోలీసుల అప్రమత్తం

బోయిన్‌పల్లికి చెందిన హేమంత్‌కుమార్ ఇంట్లో వచ్చే నెలలో వివాహం ఉంది. ఈ శుభకార్యం కోసం ఫంక్షన్ హాల్ బుకింగ్ మొదలు.. నగల కొనుగోలు, క్యాటరింగ్ తదితర ఖర్చుల నిమిత్తం లక్షల రూపాయలు జమచేసి పెట్టుకున్నాడు. తీరా చెల్లింపుల సమయంలో ఎన్నికల షెడ్యూలు విడుదల కావడం.. అడుగడుగునా పోలీసు తనిఖీలు అవుతుండడంతో హేమంత్‌కుమార్ కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. నగదు మాత్రమే కావాలంటున్న వ్యాపారులు అదీ తమ వద్దకు తీసుకొచ్చి ఇవ్వాలి అంటున్నారు. ఆన్‌లైన్ చెల్లింపులు చేస్తే అదనంగా వేల రూపాయలు జీఎస్‌టీ చెల్లించాలి అంటున్నారు. ఇది ఒక్క హేమంత్‌కుమార్ పరిస్థితి మాత్రమే కాదు. నగరంలోని సాధారణ ప్రజలు రూ.లక్ష మించి నగదును ఎక్కడికి తీసుకువెళ్లాలన్నా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. –సికింద్రాబాద్



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

బెంబేలెత్తిస్తున్న తనిఖీలు..

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సామాన్య ప్రజలకు తీరని ఇబ్బందులు వచ్చి పడ్డాయి. అదీ మరి శుభదినాలు.. దసరా దీపావళి పండగ దినాల్లో ఇలాంటి పరిస్థితులు ఎదురవడంతో నగలు, నగదుతో బయటకు వెళ్లాలనుకుంటున్న వారు వణికిపోతున్నారు. దసరా సెలవుల నేపథ్యంలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి నిత్యం లక్షలాది మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు. రైల్వే, బస్‌స్టేషన్‌లలోనూ పోలీసు తనిఖీలు విస్తృతంగా ఉంటుండడంతో ప్రయాణికులు సైతం బెంబేలెత్తిపోతున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను ఆవరించి మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. మూడు ప్రాంతాల్లోనూ లా అండ్ ఆర్డర్ పోలీసులతో పాటు ఫ్లైయింగ్ స్క్వాడ్‌ల పేరుతో బరిలోకి దిగుతున్న పోలీసు బృందాల తనిఖీలు సాధారణ ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్నాయి.

రూ.లక్షకు మించితే సీజ్..

ఈ నెలాఖరు నుంచి డిసెంబర్ వరకు శుభముహూర్తాలు ఉన్నాయి. కొద్ది నెలలుగా మంచి ముహూర్తాల కోసం ఎదురు చేసిన వారంతా ఈ మంచి రోజుల్లోనే గృహప్రవేశాలు, వివాహాది శుభకార్యాలు చేసుకునేందుకు ముహూర్తాలు పెట్టుకున్నారు. వీటన్నింటి కోసం పెద్దమొత్తంలో ఖర్చులు ఉండడం మామూలే. అదీ కాకుండా బంగారం ధరలు పెరుగుతాయంటూ వదంతులు వస్తుండడంతో ముందస్తుగా ఆభరణాలు కొనేందుకు వస్తున్న వారు పోలీసులను చూసి జంకుతున్నారు. సికింద్రాబాద్ ప్రాంతంలో పెద్దసంఖ్యలో బంగారం దుకాణాలు ఉన్నాయి. ఇక్కడికి డబ్బులు పట్టుకొని రావడం కోసం భయభ్రాంతులకు గురవుతున్నారు. కొన్ని బంగారం దుకాణాల యజమానులు రూ.1లక్షకు మించి నగదును స్వీకరించడం లేదు. లక్షకు మించిన ఆభరణాల కొనుగోళ్లకు ఆన్‌లైన్ పేమెంట్లను మాత్రమే స్వీకరిస్తున్నారు. ఆన్‌లైన్ సదుపాయం లేనివారు వారు పన్ను రహిత వ్యాపారం చేసేవారిని ఆశ్రయించం కోసం పోలీసుల కళ్లుగప్పి ప్రయాణాలు చేస్తున్నారు.

తప్పని ఇబ్బందులు..

ఎన్నికల కోడ్ నెపంతో కొందరు పోలీసులు ఉద్దేశపూర్వకంగానే సాధారణ ప్రజలను విచారణ పేరుతో ఇబ్బందులు పెడుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. పెళ్లిళ్లు తదితర శుభకార్యాల కోసం, కళాశాలల్లో ఫీజులు చెల్లించడం కోసం తాము డబ్బు, ఆభరణాలు తీసుకెళ్లాల్సి వస్తుందని వాహనదారులు తనిఖీల్లో చెబుతున్న సమయంలో కొందరు అధికారులు వదిలేస్తుండగా మరికొందరు పోలీసు అధికారులు మాత్రం బిల్లులు చూపాల్సిందేనని, నగదు లావాదేవీ లెక్కలు కావాలని నగదు, నగలను సీజ్ చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇంకా కొన్ని పార్టీలు అభ్యర్థులను ఖరారు చేయలేదు. కనీసం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కూడా కాలేదు. అప్పుడే ఎన్నికల కోడ్ పేరుతో తనిఖీలను విస్తృతం చేయడం, సాధారణ ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం బాధాకరమని సాధారణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జంగ్ తెలంగాణ 2023

కంటోన్మెంట్‌లో గెలిచి సీఎంకు కానుకగా ఇవ్వాలి

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

రసూల్‌పురా: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్య నందితను భారీ మెజార్టీతో గెలిపించి కంటోన్మెంట్ సీటును సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. కంటోన్మెంట్ లీ ప్యాలెస్‌లో మంగళవారం నియోజకవర్గ సర్వసభ్య సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ మేనిఫెస్టో చూసి ప్రతిపక్ష పార్టీల మైండ్ బ్లాక్ అయిపోయిందని అన్నారు. గతంలో కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి హేమాహేమీలు గెలుపొందినా అభివృద్ధి చేయలేదని సీఎం కేసీఆర్ సహకారంతో సాయన్న చేశారని గుర్తు చేశారు. లాస్యనందిత మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బీఆర్‌ఎస్ బీఫారమ్ అందజేసిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గత ఎన్నికల్లో తరహా ఈ సారి కూడా గులాబీ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. బేవరేజేస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పేదల పక్షపాతి అని నిరంతరం వారి సంక్షేమం కోసం పాటుపడతారని ఈ సారి జరిగే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జక్కుల మహేశ్వర్ రెడ్డి, అనితాప్రభాకర్, నళిని కిరణ్, శ్యాంకుమార్, భాగ్యశ్రీ లోక్‌నాథ్, పాండుయాదవ్, టీఎన్. శ్రీనివాస్. వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బౌద్ధనగర్‌లో ఎన్నికల ప్రచారం



తనకు ఓటేయాలని వృద్ధురాలిని అభ్యర్థిస్తున్న పద్మారావుగౌడ్

బౌద్ధనగర్: రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందించామని సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ అన్నారు. మంగళవారం బౌద్ధనగర్ డివిజన్‌లోని అంబర్ నగర్, అశోక్ నగర్, సంజీవపురం తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేయని వాగ్దానాలను కూడా నెరవేర్చామని, ఎన్నికల్లో హామీలు ఇచ్చి మరిచిపోయే ఈ రోజుల్లో తాము ఏ హామీలు ఇవ్వకుండా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చామన్నారు. అనంతరం సీఎం కేసీఆర్ ప్రకటించిన బీఆర్‌ఎస్ మేనిఫెస్టోతో పాటు సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో తన హయాంలో చేపట్టిన ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలతో రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కంది శైలజ, సామల హేమ, సునీత, ప్రసన్నలక్ష్మి, బీఆర్‌ఎస్ యువ నేతలు కిషోర్ గౌడ్, కిరణ్, రామేశ్వర్, త్రినేత్ర, సుంకు రాంచందర్, కంది నారాయణ, రాజేష్, ఆంజనేయులు గౌడ్, సుమలత, బల్ల గీత, మానస పాల్గొన్నారు.

కుటుంబ పాలనకు స్వస్తి పలకాలి

బౌద్ధనగర్: తెలంగాణ రాష్ట్ర ప్రజలు కేసీఆర్ కుటుంబ పాలనకు స్వస్తి పలకాల్సిన సమయం ఆసన్నమైందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాత్రి జామై ఉస్మానియాలోని ఫంక్షన్ హాలులో జరిగిన బీజేపీ పోలింగ్ బూత్, కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో విసిగిపోయిన ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. ప్రజా ప్రజా సమస్యల పరిష్కారం, పథకాల అమలులో బీఆర్‌ఎస్ విఫలమైందని ఆరోపించారు. ప్రధాని నాయకత్వంలో ఈ నలభై రోజులు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజల మద్దతు కూడగట్టి బీజేపీ అభ్యర్థులను గెలిపించడానికి కృషి చేయాలన్నారు. సికింద్రాబాద్‌లో బీజేపీకి పూర్వవైభవం రావడం ఖాయమని డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. వెంకటరమణి, సారంగపాణి, బండా కార్తీకరెడ్డి, రవిప్రసాద్ గౌడ్, నామోజి, నాగేశ్వర్‌రెడ్డి, రాచమళ్ల కృష్ణమూర్తి, శ్యామ్ సుందర్, సతీష్, విజయ్‌కుమార్, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

2 కేజీల బంగారం స్వాధీనం

రాంగోపాల్‌పేట్: మహంకాళి పోలీసులు ఎస్డీ రోడ్డులోని మినర్వా కాంప్లెక్స్ ప్రాంతంలో మంగళవారం వాహనాల తనిఖీలు చేస్తుండగా..ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి వద్ద 2 కేజీల బంగారు బిస్కెట్లు పట్టుబడ్డాయి. నిర్మల్‌కు చెందిన ఓ బంగారం వ్యాపారి వద్ద పనిచేసే శ్రీకాంత్..యజమాని ఆదేశాల మేరకు బంగారం కొనుగోలు చేసి తీసుకుని వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు.

బతుకమ్మ వేడుకలకు ముస్తాబవుతున్న నాగులూరి పార్కు



పార్కు అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న నాగులూరి సాయిబాబా

చిలకలగూడ: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు చిలకలగూడలోని నాగులూరి నర్సింహా జీహెచ్‌ఎంసీ పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. నాగులూరి నర్సింహా వెల్ఫేర్ అసోషియేషన్ చైర్మన్ నాగులూరి సాయిబాబా మంగళవారం పార్కును సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అసోషియేషన్ ఆధ్వర్యంలో సుమారు రెండు దశాబ్దాలుగా జీహెచ్‌ఎంసీ నుంచి దత్తత తీసుకుని ప్రతిఏటా లక్షలాది రూపాయల వ్యయంతో నిర్వహణ బాధ్యతలు చేపట్టి పార్కును అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. బతుకమ్మ వేడుకల నేపథ్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, రంగులు, వైట్‌వాష్, బోర్డులు, బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు పాండ్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. బతుకమ్మ పోటీలు ఏర్పాటు చేసి విజేత మహిళలకు బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాగులూరి నర్సింహా వెల్ఫేర్ అసోషియేషన్ ప్రతినిధులు గిరిధర్, నర్సింహారావు, సతీష్, ప్రమోద్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికులను తొలగించడం తగదు



ధర్నా చేస్తున్న కమిటీ సభ్యులు

అడ్డగుట్ట: అవుట్ కం వర్క్ బేసిస్ సాకుతో తొలగించిన రైల్వే కార్మికులను వెంటనే పనుల్లోకి తీసుకోవాలని రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఏపీ స్టేట్ కమిటీ ప్రధాన కార్యదర్శి వీవీఎల్ నరసింహులు డిమాండ్ చేశారు. మంగళవారం యూనియన్ ఆధ్వర్యంలో రైల్ నిలయం ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. విజయవాడలోని రక్ష సెక్యూరిటీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు రైల్వే స్టేషన్ క్లీనింగ్ కార్మికుల్లో 120 మందిని అవుట్ కం వర్క్ బేసిస్ సాకుతో తొలగించడం అన్యాయమన్నారు. వీరు 12 ఏళ్ల నుంచి విజయవాడ రైల్వే స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారని హఠాత్తుగా తొలగించడం ద్వారా వీరి కుటుంబాలు రోడ్డుపైన పడతాయని పేర్కొన్నారు. అనంతరం యూనియన్ ప్రతినిధులు ఏఐఆర్‌ఎఫ్ జాయింట్ సెక్రటరీ శివకుమార్‌తో వెళ్లి రైల్వే అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

కుమ్మరులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి

లాలాపేట: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దాదాపు 20 లక్షల మంది కుమ్మరి సామాజిక వర్గాన్ని అన్ని రాజకీయ పార్టీలు విస్మరించడం తగదని కుమ్మరి సంఘం రాష్ట్ర నాయకులు ఆంజనేయులు అన్నారు. సమైఖ్య రాష్ట్రంలో కన్నా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కుమ్మర్లు మరింత వెనుకబాటుకు గురైనట్లు పేర్కొన్నారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల కుమ్మర్లు సామాజిక, ఆర్థిక, రాజకీయంగా వెనుకంజలో ఉన్నారన్నారు. రాష్ట్రంలోని కుమ్మర్లనందరిని ఏకం చేసి కుమ్మర్ల శంఖారావం పేరుతో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసి తమ సత్తాను చాటుతామన్నారు. కుమ్మర్లకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించిన పార్టీలకు తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

వ్యాపారులను వేధించొద్దు

బన్సీలాల్‌పేట్: ఎన్నికల నిబంధనల పేరిట వ్యాపారులను వేధించరాదని కోరుతూ మంగళవారం వ్యాపార సంఘం ప్రతినిధులు ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ బులియన్ జెమ్స్, జువెలరీ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ప్రతినిధులు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వికాస్ రాజ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆభరణాల తయారీ ప్రక్రియలో మౌల్డింగ్ , స్టోన్ ఫిట్టింగ్, పాలిషింగ్ వంటి పనులపై బంగారు ఆభరణాలతో ఆయా ప్రాంతాలకు వెళ్లేవారిని పోలీసులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని సరైన పత్రాలు ఉంటే వెంటనే వదిలేయాలన్నారు. వినతి ఇచ్చిన వారిలో కమిటీ రాష్ట్ర అధ్యక్షులు జగదీష్ ప్రసాద్, సురేష్ భోంస్లే, కీర్తి నరేష్, రాఘవాచారి ఉన్నారు.

పద్మారావుగౌడ్‌ను ఓడిస్తాం



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

అడ్డగుట్ట: పదేళ్లుగా సికింద్రాబాద్ నియోజకవర్గ ప్రజల సమస్యలు పట్టించుకోని బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను ఓడిస్తామని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ అన్నారు. తుకారాంగేట్‌లోని సుభాష్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. పదేళ్లుగా అధికారంలో ఉన్నప్పటికీ నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పద్మారావుగౌడ్ విఫలమయ్యారని ఆరోపించారు. ప్రభుత్వ పథకాల అమలులో తమ పార్టీ కార్యకర్తలకే ప్రాధాన్యం ఇచ్చారని, సామాన్య ప్రజలను విస్మరించారన్నారు. ప్రజా సంక్షేమంపై దృష్టి సారించని బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



మంత్రి సమక్షంలో పార్టీలో చేరిన యువకులు

సనత్‌నగర్: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లోకి చేరుతున్నారని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద రాంగోపాల్‌పేట డివిజన్ వెంగళరావునగర్‌కు చెందిన పలువురు యువకులు మంగళవారం మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. మంత్రి మాట్లాడుతూ.. తొమ్మిదిన్నరేళ్లలో ఎవరూ ఊహించినంత అభివృద్ధి చేశామన్నారు. రాంగోపాల్‌పేట డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో సాయినాథ్, రవికుమార్, సాయిదీపక్, సందీప్, శ్రీకాంత్, సన్నీ, ఉదయ్, అఖిల్ బీఆర్‌ఎస్‌లో చేరారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: గ్రీన్ ల్యాండ్స్ సబ్‌డివిజన్ బేగంపేట సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ బానోతు చరణ్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఐజీపురం, బేగంపేట బస్తీ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

క్రైం కార్నర్..

కదులుతున్న రైలెక్కుతుండగా జారిపడి వ్యక్తి మృతి

సికింద్రాబాద్: కదులుతున్న రైలు ఎక్కబోయి కింద పడి వ్యక్తి ఓ మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. భువనగిరికి చెందిన పల్లెరల గణేశ్ (40) తమ గ్రామానికి వెళ్లేందుకు రైల్వేస్టేషన్ 2వ నెంబరు ప్లాట్‌ఫామ్ నుంచి సోమవారం మధ్యాహ్నం కదులుతున్న రైలు ఎక్కే ప్రయత్నం చేస్తుండగా కాలుజారి ప్లాట్‌ఫామ్–రైలు బోగీకి మధ్యన ఇరుక్కుపోయాడు. చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా మంగళవారం తెల్లవారు జామున మృతి చెందాడు.

రైల్వే స్టేషన్‌లో నిద్రిస్తూ..

అనారోగ్యంతో వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని చందౌలి జిల్లా కమల్పూర్ గ్రామానికి చెందిన ఓంప్రకాష్ రాయ్(45) కొన్ని రోజుల క్రితం నగరానికి వచ్చి బండ్లగూడలోని ఐకామ్ కంపెనీలో కూలి పని చేస్తుండేవాడు. ఈ నెల 16న తన గ్రామానికి వెళ్లేందుకు కొంత మందితో కలిసి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చి రాత్రి ప్లాట్‌ఫాం నెం .1 లో పడుకుని నిద్రలోనే మరణించాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

అడ్డగుట్ట: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ దయాకర్ వివరాల ప్రకారం.. అడ్డగుట్ట కమ్యూనిటీహాల్ ప్రాంతానికి రామగిరి ప్రకాష్(43) బైక్ మెకానిక్ పని చేస్తుంటాడు. కొన్ని రోజులుగా మద్యానికి బానిసైన ప్రకాష్ పని మానేసి ఇంట్లోనే ఉంటున్నాడు. సోమవారం తన వద్ద మద్యానికి డబ్బులు లేకపోవడంతో భార్య వద్ద తీసుకొని తాగి ఇంటికొచ్చాడు. రాత్రి అందరూ పడుకున్న తర్వాత మద్యం మత్తులో సీలింగ్ రాడ్‌కు తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య రాధిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యార్థి ఉద్యమకారులకు ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమ విద్యార్థి నాయకులకు ఎమ్మెల్యేలుగా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని ఓయూ విశ్రాంత అధ్యాపకులు ప్రొ.గాలి వినోద్‌కుమార్ వివిధ పార్టీల నేతలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ కోసం చదువులను పక్కనపెట్టి పోరాడిన విద్యార్థి నేతలకు అన్ని రాజకీయ పార్టీలు టికెట్లు కేటాయించాలన్నారు. నాడు ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన విద్యార్థులు భవిష్యత్‌లో సమాజ సేవచేసేందుకు అవకాశం కల్పించాలన్నారు. టికెట్ అడిగినందుకు ఓయూ విద్యార్థి జేఏసీ నాయకులు కురువ విజయ్‌ని కాంగ్రెస్ పార్టీ బహిష్కరించడం బాధాకరమన్నారు.

బీజేపీ విజయానికి కృషి చేయాలి



బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించిన శ్యాంసుందర్ గౌడ్

పద్మారావునగర్: బీజేపీ విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ నాయకులు బి.శ్యాంసుందర్ గౌడ్, మర్రి శశిధర్‌రెడ్డి, టి.రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్‌లో మంగళవారం బీజేపీ కార్యాలయ ప్రారంభోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం అథోగతి పాలయిందని ప్రజలు కేసీఆర్ పాలనతో విసిగిపోయారన్నారు. బూత్ స్థాయి నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలన్నారు. బీఆర్‌ఎస్ డబ్బు, మద్యంతో ఎన్నికల్లో గెలువాలని ప్రయత్నిస్తున్నదని మండి పడ్డారు. సనత్‌నగర్‌లో బీజేపీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమేష్ ఖండెల్వాల్, పెద్ది రవీందర్, గుండు క్రిష్ణ, ఎస్. రాజు, శ్రీనివాస్ ముదిరాజ్, సత్యనారాయణ, కుర్మ శంకర్, డి. లక్ష్మీ, శీలం శివలింగం, రాజేష్ పాల్గొన్నారు.

ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మా..



జెక్‌కాలనీ ఎస్‌వీఎస్‌ఎస్ వద్ద బతుకమ్మ సంబరాల్లో మహిళలు



బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ వేడుకలో విద్యార్థులు, ఉపాధ్యాయులు



బతుకమ్మ ఆడుతున్న కార్పొరేటర్ దీపిక

రాంగోపాల్‌పేట్/అడ్డగుట్ట/సనత్‌నగర్: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయ ప్రతీక బతుకమ్మ వేడుకలు సనత్‌నగర్‌లో ఘనంగా కొనసాగుతున్నాయి. రంగురంగుల పుష్పాలతో బతుకమ్మలను అందంగా తీర్చిదిద్ది ఒకచోట పేర్చి ఆడిపాడారు. జెక్‌కాలనీ బతుకమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రోడ్డునెంబర్–1లోని ఎస్‌వీఎస్‌ఎస్ అపార్ట్‌మెంట్ వద్ద మంగళవారం సాయంత్రం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు చింతిరెడ్డి ప్రభ, ప్రధాన కార్యదర్శి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.అన్నపూర్ణలతో పాటు ఆదిలక్ష్మీదేవి, కేవీ రమణమ్మ, భాగ్యలత, విజయలక్ష్మి, వాణి ఏర్పాట్లు చేశారు.

◆ బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో బతుకమ్మ సంబురాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు, అధ్యాపక, సిబ్బందికి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి పాల్గొన్నారు.




అన్నపూర్ణాదేవిగా బేగంపేట కట్టమైసమ్మ అమ్మవారు




శ్రీలతాదేవిగా ప్రకాష్‌నగర్ భూలక్ష్మీ అమ్మవారు



రాజరాజేశ్వరీదేవిగా మహంకాళి అమ్మవారు



బల్కంపేట ఎల్లమ్మను డ్రైఫ్రూట్స్‌తో అలంకరించిన దృశ్యం



కనకదుర్గ, హనుమాన్ ఆలయంలో గాయత్రీ దేవీగా

అమ్మరూపం.. దేదీప్యమానం

దసరా దేవి శరన్నవరాత్రి వేడుకల సందర్భంగా అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తుతున్నారు. ఆయా మండపాల్లో ప్రతిష్ఠించిన అమ్మవార్లు రోజుకొక రూపంలో భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. పలు ప్రాంతాల్లో దుర్గాదేవీ మండపాల వద్ద అన్నదానాలు నిర్వహిస్తున్నారు. సాయంత్రం నిర్వహిస్తున్న సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి.
–సికింద్రాబాద్, సనత్‌నగర్ జోన్ల బృందం



రాజరాజేశ్వరీ అమ్మవారం ఆలయంలో కార్పొరేటర్ పూజలు